రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

విశాలాంధ్ర-ఏలేశ్వరం: మోటార్ సైకిల్ అదుపుతప్పి రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన ఏలేశ్వరం తిరుమలి రోడ్డు వద్ద చోటు చేసుకుంది. ఈ మేరకు స్థానిక ఎస్సై జి సతీష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలేశ్వరం రెల్లి పేటకు చెందిన ఉండూరు వెంకటరెడ్డి తన స్నేహితుడయిన కొండపల్లి దుర్గ (అశోక్)(18)తో కలిసి ఆదివారం మధ్యాహ్నం యమహా ఫ్యాషన్ మోటార్ సైకిల్ పై యర్రవరం వెళ్ళి తిరిగి ఏలేశ్వరం వచ్చుచుండగా తిరుమాలి కాలనీ దాటిన తరువాత వెంకటరెడ్డి తన బండిని అదుపు చెయ్యలేక రోడ్ ప్రక్కనగల చెట్టును గ్రుద్దుకొని క్రింద పడిపోవడంతో బండి వెనుక కూర్చున్న కొండపల్లి దుర్గ (అశోక్) తలకు బలమయిన గాయం తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఆయన తెలిపారు. బండిని నడుపుచున్న వెంకటరెడ్డి కి బలమైన గాయాలు అవ్వడంతో ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భారీ బైక్ ర్యాలీ

విశాలాంధ్ర-సామర్లకోట: హనుమాన్ జయంతి పురస్కరించుకుని సామర్లకోట పట్నంలో జై హనుమాన్ అంటూ భారీ బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీ పెద్ద ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద నుండి బయలుదేరి బ్రౌన్ పేట మీదగా బల్ల బల్లమార్కెట్ నుండి స్టేషన్ సెంటర్కు చేరుకుని అక్కడ నుండి మటం సెంటర్ మీదుగా పెద్దాపురం వెళ్ళింది. ఈ భారీ బైక్ ర్యాలీలో సామర్లకోట పెద్దాపురం పట్టణాలకు చెందిన మహిళలు, యువత భారీగా పాల్గొనగా పలు హిందూ దేవతల వేషాలు అందరినీ ఆకర్షించాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ర్యాలీ వెంట ఉండి బందోబస్తు నిర్వహించారు. అదేవిధంగా సంత మార్కెట్ వద్ద గల అతి పురాతన ఆంజనేయస్వామి గుడి వద్ద ఆలయ భక్తుల ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు భక్తులకు అందజేశారు.

గ్రంథాలయాలు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-దేవరపల్లి: వేసవిలో గ్రంథాలయాల్లో విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన దేవరపల్లి శాఖ గ్రంథాలయ అధికారి కె వి వి ప్రసాద్ రెడ్డి తెలిపారు దేవరపల్లి శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు పుస్తక ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు పాల్గొన్నారు.

సురుచి ఫుడ్స్ ప్రారంభం

విశాలాంధ్ర-కాకినాడ: కాకినాడ అచ్చంపేటలో ఆదివారం సురుచి ఫుడ్స్ బ్రాంచ్ ప్రారంభోత్సవంతో పాటు మదర్స్ డే వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. కాకినాడ ఎంపీ వంగా గీత విశ్వనాథ్, మాజీమంత్రి కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, మరో మాజీ మంత్రి, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, యానం ఎమ్మెల్యే గొల్లపల్లి అశోక్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, అతిరథమహారథులు హాజరయ్యారు. కాకినాడలో సురుచి ఫుడ్స్‌కు సంబంధించి ఇది మూడవ బ్రాంచ్. అదే వేదికగా మదర్స్ డే కూడా నిర్వహించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కాకినాడ నగర అధ్యక్షురాలు, మాజీ, మేయర్, సుంకర శివ ప్రసన్న సాగర్, కౌడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి కుమార్, ఎంఎల్‌సి అభ్యర్థి కర్రి పద్మశ్రీ, కాకినాడ రూరల్ మాజీ ఎంఎల్‌ఏ పిల్లి అనంత లక్ష్మి, ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరావు అధికారులు పాల్గొన్నారు. సురుచి అధినేత మల్లిబాబు కుటుంబ సభ్యులు అతిథులకు స్వాగతం పలికారు.

ఇంటింటికి జనం కోసం పవన్ -పవన్ కోసం మనం

విశాలాంధ్ర-కాకినాడ: కాకినాడ రూరల్ మండలం గంగనపల్లి గ్రామంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శిరంగు శ్రీనివాస్, గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు కుర్ర నాగబాబు, ఆధ్వర్యంలో జనం కోసం పవన్ -పవన్ కోసం మనం కార్యక్రమం ద్వారా ఇంటింటికి పాదయాత్ర చేస్తూ సమస్యలు తెలుసుకుంటూ ఉన్న జనసేన పార్టీ పిఎసి సభ్యులు, కాకినాడ రూరల్ ఇంచార్జ్ పంతం నానాజీ ఈ గ్రామంలో పర్యటన చేస్తున్న నానాజీకి స్థానికులు అనేక సమస్యలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన నాయకులు కుర్ర శరత్ కుమార్, భాస్కర్, రమేష్, నందిపాటి శ్రీనివాస్, పల్లెటి ప్రకాష్, మరియు కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, మండల నాయకులు, గ్రామ నాయకులు, జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

ఐఎన్ఐసీఈటీలో వాసుకి ప్రతిభ

విశాలాంధ్ర-మామిడికుదురు: మామిడికుదురుకు చెందిన డాక్టర్ ధూళిపూడి వెంకట సత్య వాసుకి ప్రతిష్టాత్మకమైన కేంద్రీయ వైద్య విద్యాలయాలలో పీజీ వైద్య విద్యకు ఎయిమ్స్ నిర్వహించే ఐఎన్ఐసీఈటీ-2023లో 472 ర్యాంకు సాధించినట్లు తల్లిదండ్రులు స్థానిక మీడియాకు ఆదివారం చెప్పారు. ఈ నెల 13 రాత్రి విడుదలైన ఆ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఆమె జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. ఇటీవల ఆమె నీట్ పీజీ పరీక్షలో జాతీయ స్థాయిలో 2083వ ర్యాంకు కూడా సాధించింది. విశాఖపట్నం గాయత్రి వైద్య కళాశాలలో ఎమ్‌బిబిఎస్ పూర్తి చేసిన ఆమె స్వీయ శిక్షణలోనే ఈ రెండు ర్యాంకులు సాధించడం గమనార్హం. ఈ ఉత్తమ ర్యాంకు సాధనతో కోనసీమ కు చెందిన పలువురు ప్రముఖులు, దీప్తి విద్యా సంస్థలకు చెందిన బోధన, బోధనేతర సిబ్బంది ఆమెకు అభినందనలు తెలియజేసారు.

తేజస్వినిలో మాతృ దినోత్సవం

విశాలాంధ్ర-అమలాపురం: మాతృ దినోత్సవం సందర్భంగా ఆదివారం తేజస్విని ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ, అమలాపురం చక్కటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మండలంలోని అత్యధిక మార్కులు పదవ తరగతిలో తెచ్చుకున్న విద్యార్థినీ, విద్యార్థులను ప్రోత్సహిస్తూ పెన్నులు, పుస్తకాలు, డిక్షనరీలు, మేమెంటోళ్లు ఇచ్చి వారిని సత్కరించడం జరిగింది. మాతృ దినోత్సవం పురస్కరించుకొని వారి తల్లిదండ్రులను సాలువాలు మెమొంటోలు మరియు, పూలదండలతో ఘనంగా సత్కరించడం జరిగింది. అత్యధిక మార్కులు తెచ్చుకున్న విద్యార్థులు కుమారి దంగేటి చైతన్య సత్య పద్మిని, సుందరపల్లి యశస్విని, కుమారి సత్తి వింధ్య, కే పవన్ రామ్ సాయి, మల్లవరపు చైతన్య జ్యోతి, ఉద్దేశపు చరణ్‌లను సంస్థ అధినేత ఉద్దీసపు వెంకటేశ్వరరావు (చిన్న) మరియు వారి సిబ్బంది ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ పర్సన రెడ్డి సత్య నాగేంద్రమణి, ఎంపీపీ కుడిపూడి భాగ్యలక్ష్మి, కౌన్సిలర్ చిట్టూరి పెదబాబు త్సవటపల్లి రమా తేజస్విని హాజరయ్యి విద్యార్థిని, విద్యార్థులకు చక్కటి సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమానికి బీవీ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. విద్యార్థిని విద్యార్థుల తల్లితండ్రులను ఘనంగా సత్కరించారు. విప్పర్తి రమేష్, ఆకుల ఉమామహేశ్వరరావు, నల్లా నరసింహమూర్తి, మోటుపల్లి జయస్ కుమార్, డాక్టర్ వై సౌందర్య హాజరయ్యారు.

హనుమాన్ శోభాయాత్ర

విశాలాంధ్ర-జగ్గంపేట: జగ్గంపేటలో శ్రీ హనుమాన్ శోభాయాత్రను హిందువులు నిర్వహించారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న ఆంజనేయస్వామి ఆలయం నుండి హిందువులంతా కలిసి బైక్‌లపై బయలుదేరి సర్వీస్ రోడ్డు మీదుగా శ్రీ రావులమ్మ తల్లి ఆలయానికి చేరుకున్నారు. అక్కడినుండి పట్టణంలోని పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి కాకినాడ రోడ్డు మీదుగా సెంటర్‌కి చేరుకున్నారు. ఈ శోభాయాత్రలో కేసరియా హిందూ వాహిని రాష్ట్ర అధ్యక్షులు దాట్ల కృష్ణ వర్మ, విశ్వహిందూ పరిషత్ సభ్యులు పాబోలు సీతారామస్వామి, కొత్త నాగ పండు తదితరులు పాల్గొన్నారు.

వెంకట్‌నగర్‌లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్

విశాలాంధ్ర-కాకినాడ: నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల ఆదేశాల మేరకు ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు ఆదివారం కాకినాడ వెంకట్ నగర్ ప్రాంతంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. కార్పొరేషన్ ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు పాల్గొని పర్యవేక్షించారు. నిరుపయోగంగా ఉన్న ఖాళీ స్థలాల్లో స్థానికులు, పరిసర ప్రాంతాల ప్రజలు చెత్తను వేయడం వల్ల ఆ స్థలాలు డంపింగ్ యార్డుల్లా మారుతున్న పరిస్థితుల్లో ఈ డ్రైవ్ చేపట్టారు. కాలనీల సంక్షేమ సమాఖ్య గౌరవ అధ్యక్షుడు వైడి రామారావు, మాజీ కార్పొరేటర్ కంపర బాబి, సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. వెంకట్ నగర్ ప్రాంతంలోని ఎంపిక చేసిన కొన్ని ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్తను, పిచ్చి మొక్కలను తొలగించారు. ఒక జెసిబి, చెత్త తరలింపునకు ట్రాక్టర్‌తో పాటు చెత్తను తొలగించేందుకు పారిశుద్ధ్య కార్మికులను కూడా ఏర్పాటు చేశారు. ఏడిసి నాగ నరసింహారావు ఈ కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షించి చెత్తను ఖాళీ స్థలాల్లో వేయవద్దంటూ ప్రజలకు అవగాహన కల్పించారు. నగరపాలక సంస్థ ఆరోగ్య అధికారి డాక్టర్ పృథ్వి చరణ్, ఆల్ ఈజ్ వెల్ ప్రతినిధి కిషోర్, శానిటరీ సూపర్వైజర్లు జిలాని, రాంబాబు, శానిటరీ ఇన్స్పెక్టర్లు కార్యక్రమానికి హాజరయ్యారు.

చెత్తను వేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం -ఏడిసి : చెత్తను ఇంటికి వచ్చే పారిశుద్ధ్య కార్మికులకు ఇవ్వకుండా దగ్గరలోని ఖాళీ స్థలాల్లో వేసే వారికి నోటీసులు ఇచ్చి కఠిన చర్యలు తీసుకుంటామని ఏడిసి సిహెచ్ నాగ నరసింహారావు స్పష్టం చేశారు. స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది స్థల యజమానుల నిర్లక్ష్య వైఖరి వల్ల చెత్త పేరుకుపోయి పందులు, కుక్కలు,పాములు, దోమలు చేరి ప్రజారోగ్యానికి భంగకరంగా మారుతోందన్నారు. అటువంటి స్థలాల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపట్టినప్పటికీ అందుకు అయ్యే ఖర్చును, స్థల యజమానుల పైన, చెత్తను వేసే వారి నుంచి వసూలు చేస్తామన్నారు. అవసరమైతే చట్ట ప్రకారం కఠిన చర్యలు కూడా తప్పవన్నారు. డ్రైవ్‌లో భాగంగా కాకినాడ నగరంలో గుర్తించిన నాలుగు వేల ఖాళీ స్థలాలకు సంబంధించి 780 స్థలాల్లో చెత్త అధికంగా పేరుకుపోయినట్లు గుర్తించామన్నారు. ఇప్పటికే 70 స్థలాలను శుభ్రం చేయించామని, మిగిలిన స్థలాల్లో కూడా ప్రతి ఆదివారం ఈ డ్రైవ్ కొనసాగిస్తామని ఏడిసి చెప్పారు.

ప్రజలు సహకరించాలి -వైడిఆర్ : నగరపాలక సంస్థ చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రజలు కూడా తగిన తోడ్పాటు అందించాలని కాలనీల సంక్షేమ సమాఖ్య గౌరవాధ్యక్షులు వైడి రామారావు కోరారు. ప్రజలు కూడా సహకరించినప్పుడే స్మార్ట్ సిటీకి అర్థం ఉంటుందన్నారు. ఖాళీ స్థలాల్లోని చెత్త కారణంగా డెంగ్యూ కేసులు కూడా బాగా పెరుగుతున్నందున ప్రతి ఒక్కరూ సహకరించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. సమన్వయంతోనే సాధ్యం మాజీ కార్పొరేటర్ బాబి : అధికారులు చేపట్టిన ఇటువంటి మంచి కార్యక్రమానికి ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని మాజీ కార్పొరేటర్ కంపర బాబి పేర్కొన్నారు. అందరి సమన్వయంతోనే కాకినాడ నగరాన్ని క్లీన్ సిటీగా తయారు చేయగలమని, రానున్న వర్షాకాలంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆరోగ్యకర వాతావరణాన్ని కల్పించుకోగలమన్నారు.

శారీరక ఆరోగ్యానికి యోగా

విశాలాంధ్ర-కపిలేశ్వరపురం: అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం శారీరక ఆరోగ్యానికి యోగ దోహదం. ప్రస్తుత యాంత్రిక జీవన విధానంలో మనిషి అనేక ఒడుదుడుకులు, ఒత్తిడులకు గురవుతున్నాడని, వాటి నివారణకు శారీరక, మానసిక వికాసానికి యోగ దోహదం చేస్తున్నదని గ్రామ సర్పంచ్ సాక శ్రీనివాస్ అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆదేశానుసారం స్థానిక శాఖ గ్రంథాలయం వద్ద జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం శిక్షణ తరగతుల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు యోగాసనాలు ఆవశ్యకత గూర్చి వివరించారు. యోగ శిక్షకుడు భానుతేజ విద్యార్థులచే పలు రకాల సూర్యనమస్కారాలు, యోగాసనాలు వేయించారు. ప్రతి నిత్యం యోగ చేయడం ద్వారా ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చు అన్నారు. గ్రంథాలయాధికారిణి డి శివకుమారి, చిట్టూరి. సత్యనారాయణ రిటైర్డ్ టీచర్, లక్ష్మి రిసోర్స్ పర్సన్ మరియు గ్రామ పెద్దలు, పాఠకులు పాల్గొన్నారు.

కోడి కత్తి శ్రీను కుటుంబానికి హర్షకుమార్ పరామర్శ

విశాలాంధ్ర-ముమ్మిడివరం: రాణేలంకలో సీఎం జగన్ పై కోడి కత్తి దాడి కేసులో నింది తుడైన జనిపల్లి శ్రీనివాస్ కుటుంబ సభ్యులను అమలాపురం మాజీ ఎంపీ హర్ష కుమార్ పరామర్శించారు. కోడి కత్తి శ్రీను రాసిన లెటర్‌ను రాష్ట్ర ప్రభుత్వం జాతీయ దర్యాప్తు సంస్థలు బయటపెట్టాలని హర్ష కుమార్ విజ్ఞప్తి చేశారు.

భక్తి శ్రద్ధలతో హనుమాన్ జయంతి

విశాలాంధ్ర-సీతానగరం: కోరుకొండలో హన్‌మాన్ జయంతి సందర్భంగా నిర్వహించిన శోభయాత్ర కన్నుల పండుగగా జరిగింది. చుట్టుపక్కల ప్రాంతాల నుండి అనేకమంది హన్‌మాన్ భక్తులు తరలివచ్చి జై శ్రీరామ్ జైజై శ్రీరామ్ నినాదాలతో శోభయాత్ర జరిగింది. దీనిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీజీసి సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి కోరుకొండలోని కోనేరు వద్ద ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో శాంతి,ఆధ్యాత్మిక భావన, ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడానికి ఈ శోభాయాత్రలు ఎంతగానో ఉపయోగ పడతాయన్నారు. వివిధ పార్టీ నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పేదలపాలిట వరం నవరత్నాలు

విశాలాంధ్ర-కరప: సీఎం జగన్మోహన్ రెడ్డి నవరత్నాలు అనే తొమ్మిది సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రతి గడపకు వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకోవాలని ఎమ్మెల్యేలకు ఆదేశాలు జారీ చేయడంతో గడపగడపకు మన ప్రభుత్వం అనే కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకోవడం జరుగుతుంది. ఆదివారం మండల కేంద్రమైన కరప గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మూడవ రోజు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు కరప నిలయ్యాతోటలో గడపగడపకి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారులు సత్వరమే మౌలిక వసతులు కల్పించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ పింకే శ్రీలక్ష్మీ సత్తిబాబు, జెడ్పీటీసీ వై సుబ్బారావు,వైస్ ఎంపీపి భీమన్న, భాస్కర్, సూర్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు చింతా ఈశ్వరరావు, గ్రామ సర్పంచ్ సాదే ఆశాజ్యోతి లోహిదాస్, ఆర్ గణేష్, ఎంపీడీవో కర్రే స్వప్న, తాసిల్దార్ పొన్నమండ శ్రీనివాసరావు, ఏపీ నెడ్కప్ డైరెక్టర్ సాదే విజయలక్ష్మి రాఘవ, గోన శ్రీను, రావుల నాని, సవిలె రాజేష్, మారెళ్ళ వెంకటరమణ, వైఎస్ఆర్సిపి పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీమా చెల్లించలేని స్థితిలో వైసీపీ ప్రభుత్వం

విశాలాంధ్ర-కరప: కరప మండలం పెద్ద కొత్తూరు గ్రామంలో జనం కోసం పవన్ కోసం మనం అనే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని జనసేన మండల అధ్యక్షులు బండారు మురళి తెలిపారు. ఈ కార్యక్రమానికి పిఎసి సభ్యులు పంతం నానాజీ విచ్చేసి పాదయాత్ర చేస్తూ వైసీపీ ప్రభుత్వం ప్రమాదాలలో మరణించిన వారికి భీమా అందించడంలో వెనకంజు వేస్తుందని, అప్పులు తెచ్చి బటన్ నొక్కడం ఒక్కటే పనిగా పెట్టుకుందని నానాజీ ఎద్దేవా చేశారు. వైసీపీ ప్రభుత్వం పేదలను పూర్తిగా విస్మరించిందని ఆయన పేర్కొన్నారు. భోగిరెడ్డి కొండబాబు, బోగిరెడ్డి గంగాధర్, అల్లు గంగాధర్, చింత వెంకటరావు పాల్గొన్నారు.

వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే చంద్రబాబుపై దాడి

విశాలాంధ్ర-కొత్తపేట: వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ప్రభుత్వం చంద్రబాబు ఇంటిపై రాజకీయం చేస్తోందని రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు, నియోజకవర్గ ఇంచార్జి బండారు సత్యానందరావు అన్నారు. వాడపాలెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరకట్టపై ఉన్న ఇంట్లో చంద్ర బాబు అద్దెకుంటున్నారు. ఆ ఇల్లు లింగమ నేనిది అని అందరికీ తెలుసు, ప్రజలను డైవర్ట్ చేయాలనే, కావాలనే రాజధాని కేసును తెరపైకి తెచ్చి వైసిపి రాజకీయం చేస్తుందని ఉనికిలో లేని ఇన్నర్ రోడ్డు కోసం క్విడ్ ప్రో కో జరిగిందని ఆరోపణలు చేయడం ప్రభుత్వ దివాలా కోరుతనానికి నిదర్శనమని, లోకేష్ యువగళం పాదయాత్ర వంద రోజులు పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ చేపట్టిన యువగళం పాదయాత్రలను నుండి ప్రజల దృష్టి మరల్చడానికే లింగమనేని గెస్ట్ హౌస్ ప్రభుత్వం అటాచ్ చేసి, క్విడ్ ప్రో కో ద్వారా చంద్రబాబు ఉండవల్లి కరకట్టపై గెస్ట్ హౌస్ పొందారని, ఇన్నర్ రింగ్ రోడ్డు అప్లైన్ అలైన్మెంట్ మార్పు చేశారని అభియోగం మోపుతున్నారు. గతంలో ఇదే గెస్ట్ హౌస్ నదీ పరీవాహక ప్రాంతంలో ఉందని ప్రభుత్వం నోటీసులు ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజావేదికని కూల్చివేసి, ఇప్పటికీ కూడా కూల్చిన శిధిలాలను తొలగించలేకపోయిందని, డైవర్షన్ పాలిటిక్స్‌కు వైసీపీ తెరతీసిందని, ప్రజలు ప్రభుత్వ చర్యలును గమనిస్తున్నారని, త్వరలోనే తగు రీతిలో బుద్ధి చెబుతారని సత్యానందరావు అన్నారు. కంఠంశెట్టి శ్రీనివాసరావు, బూసి భాస్కరరావు, గుబ్బల మూర్తి, సిద్దంశెట్టి వీరవెంకటసత్యనారాయణ, వీరబాబు, పప్పుల బుజ్జి పాల్గొన్నారు.

కణతి తొలగింపు

విశాలాంధ్ర-రంగంపేట: అనపర్తి సిడిఆర్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కర్రి సునీల్ కుమార్ రెడ్డి డాక్టర్ బాంధవి దంపతులు డాక్టర్ ఎస్ ఆశా నిర్మల లాప్రోస్కోపి ద్వారా మహిళ కడుపులోని 12 కిలోల కణితి తొలగించారు. పెదపూడి మండలం గంగ్రేడు గ్రామానికి చెందిన టి దుర్గ (52) కొంతకాలం నుండి కడుపు నొప్పితో బాధపడుతుండగా పలు ఆసుపత్రులకు తీసుకువెళ్లి వైద్య పరీక్షలు చేయించినా రోగం నయం కాకపోవడం తో స్థానిక సి డి ఆర్ ఆసుపత్రి కి తీసుకురావడం జరిగిందని ఆసుపత్రి అధినేతలు డాక్టర్ సునీల్ కుమార్ రెడ్డి డాక్టర్ బాంధవి దంపతులు తెలిపారు. వైద్య పరీక్షలు నిర్వహించగా కడుపులోని కణిత పెరుగుతున్నదని గుర్తించి తక్షణమే ఆరోగ్యశ్రీలో ఆపరేషన్ చేసి కణితిని లేప్రోస్కోపి ద్వారా తొలగించడం జరిగిందని డాక్టర్లు తెలిపారు. మహిళ కడుపులో పెరుగుతున్న కనితిని వైద్య పరిభాషలో ఒప్పే రియల్ హ్యూమన్ వ్యాధి అంటారని డాక్టర్ సునీల్ కుమార్ రెడ్డి చెప్పారు. ఆపరేషన్ మత్తు వైద్యులు డాక్టర్ ఎంఏ జగన్మోహన్ రెడ్డి సమక్షంలో ఆపరేషన్ విజయవంతంగా జరిగిందని సునీల్ కుమార్ రెడ్డి తెలిపారు.

కుల, మత రహిత సమాజానికి కృషి చేయాలి

విశాలాంధ్ర-కిర్లంపూడి: కుల, మత రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు నడుంబిగించాలని దళిత ఐక్య సమాఖ్య జాతీయ అధ్యక్షులు దొమ్మేటి రాజా సతీష్ పిలుపునిచ్చారు. కిర్లంపూడి మండలం వీరవరం గ్రామం నుండి కాకినాడ వరకు దళిత ఐక్య సమైక్య ఆధ్వర్యంలో దేశ రక్షణకై శాంతియుత నిరసన ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షులు దొమ్మేటి సుధాకర్ అధ్యక్షతన జరిగిన సభలో రాజా సతీష్ మాట్లాడుతూ కుల, మత, రహిత నవ ఇండియా నిర్మాణమే లక్ష్యంగా దళిత ఐక్య సమైక్య ఆధ్వర్యంలో నిరంతరం శాంతియుత పోరాటం సాగిస్తుందన్నారు. భూమిలేని నిరుపేదలకు మూడు ఎకరాల పంట భూమి ఇవ్వాలని, కుల మతాలకు అతీతంగా రిజర్వేషన్లు కల్పించాలని, మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, సంపూర్ణ మత స్వేచ్ఛను ఇవ్వాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మీ రాజకీయ లబ్ధి కోసం కుల,మతాలను విభజించి పాలించకండని రాజకీయ నాయకులను హెచ్చరించారు. వీరవరం గ్రామంలో మొదలైన ఈ ఉద్యమం రాష్ట్రవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా తీసుకెళ్లి తమ డిమాండ్లను సాధించే దిశగా పయనించి, పేదరిక నిర్మూలనకు, కుల, మత రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయడం జరుగుతున్నారు. పార్టీలకతీతంగా, కుల, మతాలకతీతంగా చేస్తున్నఈ ఉద్యమంలో అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా రాజా సతీష్ పిలుపునిచ్చారు. అనంతరం భారీ మోటర్ సైకిళ్ళు,కార్లపై వీరవరం నుండి రాజుపాలెం, కిర్లంపూడి, గెద్దనాల్లపల్లి, భూపాలపట్నం, ఎస్ తిమ్మాపురం, తామరాడ గోనేడ, జగ్గంపేట, పెద్దాపురం, సామర్లకోట మీదుగా కాకినాడ వరకు దేశ రక్షణ కోసం శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీరవరం గ్రామ సర్పంచ్ అంబటి బొజ్జమ్మ,దొమ్మేటి ట్రస్ట్ సభ్యులతోపాటు దళిత ఐక్య సమైక్య నాయకులు మడికి బాబ్జి, గొల్లపల్లి చక్రధర్, మద్దా సురేష్, బిరిసి రాజేష్, ఎమ్ముల సత్తిబాబు, దానియేల్, అధిక సంఖ్యలో దళిత ఐక సమైక్యసభ్యులు పాల్గొన్నారు.

17న యూటీఫ్ ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంపు

విశాలాంధ్ర-అమలాపురం: యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 17న ఉచిత మెగా వైద్య క్యాంపు అమలాపురం సర్ సివి రామన్ హై స్కూల్ నందు నిర్వహిస్తున్నామని యూటీఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతి బసు వెల్లడించారు. ఈ మెగా వైద్య క్యాంపు నందు అన్ని రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని రాజమండ్రి జీఎస్ఎల్ వైద్యశాల ఆధ్వర్యంలో ఈ మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని సుమారు 50 మంది డాక్టర్లు ఈ వైద్య క్యాంపునందు సేవలు అందిస్తారని, ఆదివారం అమలాపురం సర్‌సివి రామన్ స్కూల్ నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ వైద్య క్యాంపులో ఏ విధమైన ఫీజులు తీసుకొన బడవని, ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, ప్రభుత్వ, ప్రైవేటు టీచర్లు, లెక్చరర్లు, పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, ప్రజా సంఘాల కుటుంబ సభ్యులు, పేదలందరూ ఈ వైద్య క్యాంపులో జరిగే టెస్టులను చేయించుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వైస్ ప్రిన్స్ పాల్ పెద్దిరాజు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పెంకె వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వైఎస్ఎన్ బాలాజీ, జీవి రమణ, వై మొరళీ, కోప్పిశెట్టి శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి

విశాలాంధ్ర-అంబాజీపేట: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మండలంలోని అన్ని హనుమాన్ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. అంబాజీపేట సెంటర్ పెద్దవీధిలో ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ వద్ద భారీ ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. పలు గ్రామాల్లో ఉన్న రామాలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు.

విశాలాంధ్ర
గోదావరి జిల్లా
కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

ఉండ్రాజవరంలో నేడు అన్న సమారాధన

విశాలాంధ్ర-ఉండ్రాజవరం: మండలంలోని వివిధ గ్రామాలలో ఆదివారం హనుమత్ జయంతిని పురస్కరించుకుని అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. ఉండ్రాజవరంలో బాల భక్తాంజనేయ తెలగ యువజన సంఘం ఆధ్వర్యంలో 5000 మందికి, సూర్యారావుపాలెంలో అభయాంజనేయ స్వామి ఆలయ కమిటీ పేరుతో రైతులు, గ్రామస్తులు గ్రామస్తులకు అన్న సమాధన నిర్వహించారు. ఉండ్రాజవరం విఘ్నేశ్వర రజక సంఘం ఆధ్వర్యంలో సోమవారం సుమారు నాలుగువేల మందికి పైగా అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం

విశాలాంధ్ర-ఉండ్రాజవరం: మండలంలోని తాడిపర్రు లో శిథిలావస్థకు చేరుకున్న పార్వతీ సమేత సోమేశ్వర స్వామి పురాతన ఆలయం పునర్నిర్మాణానికి గ్రామ పెద్దలు నడుంబిగించారు. గ్రామ మాజీ సర్పంచ్ మట్టా సత్యనారాయణ 23లక్షల 50 వేల రూపాయలు విరాళంగా ప్రకటించినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం వెంకట్రావు ఆదివారం తెలిపారు. గ్రామంలోని భక్తులు, దాతల సహకారంతో సుమారు కోటి 50 లక్షల అంచనా వ్యయంతో, అధునాతన రీతిలో ఆలయ నిర్మాణం కొరకు శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు. మ్యాచింగ్ సొమ్ముతో కలిపి, దేవదాయ ధర్మదాయ శాఖ సుమారు రూ 80 లక్షల నిధులను మంజూరు చేసినట్లు ఈవో తెలిపారు. అధికారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణకు సహకరించాలి

విశాలాంధ్ర-ఉండ్రాజవరం: గ్రామ పారిశుద్ధ్య నిర్వహణలో ప్రజలు తమ వంతు బాధ్యతగా పాలుపంచుకోవాలని సూర్యారావు పాలెం సర్పంచ్ మెండే లలిత కుమారి కోరారు. మండలం లోని సూర్యారావు పాలెం గ్రామములో సర్పంచ్ ఆధ్వర్యములో పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా పారిశుద్ధ్య సిబ్బంది నిర్వహిస్తున్న డ్రైనేజీ పూడికతీత పనులను ఆమె స్వయంగా పర్యవేక్షించారు. ఉప సర్పంచ్ నందిన శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి వై.బాలకృష్ణ, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ గుణ సాయిరాం లు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు

విశాలాంధ్ర-రంగంపేట: స్వామిని హనుమాన్ జయంతి సందర్భంగా ఆదివారం కుతుకులూరు భక్తాంజనేయ ఆలయంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ఆదిలక్ష్మి దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, దర్శించుకున్నారు. ఆయనతోపాటు సర్పంచ్ హేమ తులసి సురేష్, ఉప సర్పంచ్ సబ్బెళ్ళ నాగిరెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ పడాల హరి సాయి కృష్ణారెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి, ఎంపిటిసి సత్తి దొరయ్య రెడ్డి తదితరులు ఉన్నారు.

హనుమాన్‌కు నల్లమిల్లి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-రంగంపేట: హనుమాన్ జయంతి పురస్కరించుకుని ఆదివారం రామవరం శ్రీ భక్త ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తాంజనేయ స్వామిని దర్శించుకున్నారు. జిల్లా తెలుగు రైతు కార్యదర్శి నల్లమిల్లి సుబ్బారెడ్డి, సతీశ్వర రెడ్డి, బసివిరెడ్డి, కర్రి శ్రీనివాసరెడ్డి, అన్నవరం ఉన్నారు.

వయోవృద్ధులకు అవగాహన ఉండాలి

విశాలాంధ్ర-అనపర్తి-రంగంపేట: వయోవృద్ధులు సంరక్షణ,పోషణ, సంక్షేమ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షులు కె మధుసూదన్ రెడ్డి అన్నారు. స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో అనపర్తి శాఖ అధ్యక్షులు పివిఎన్ సూర్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అనపర్తి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటయింది. అసోసియేషన్ అధ్యక్షునిగా ఎం వి సుబ్రహ్మణ్యం, జనరల్ సెక్రెటరీ కర్రి సత్య నారాయణ రెడ్డి, ట్రెజరర్ తాడి గణపతి రామారెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు టిఎస్వీవి సత్యనారాయణ రెడ్డి, ఉపాధ్యక్షుడు చాగంటి సుబ్రహ్మణ్యం, సహాయ కార్యదర్శిగా పంపన కిషోర్ కుమార్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.

విప్లవాత్మక సంస్కరణలకు సీఎం శ్రీకారం

విశాలాంధ్ర-రంగంపేట: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర ప్రభుత్వ సామాజిక న్యాయ సలహాదారు, వైసిపి ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు జూపూడి ప్రభాకర్ రావు అన్నారు. అనపర్తి శివారు కొత్తూరు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సెంటినరీ గురుకుల కళాశాలను జూపూడి సందర్శించి 2022-23 విద్యా సంవత్సరంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలకు సీఎం జగన్మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడమే దీనికి నిదర్శనమని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో రంగంపేట జడ్పిటిసి పేపకాయల రాంబాబు, వైస్ ఎంపీపీ కర్రి దాసు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్ తదితరులు ఉన్నారు.

యువగళానికి మద్దతుగా పాదయాత్ర

విశాలాంధ్ర-నిడదవోలు: టీడీపీ జాతీయ ప్రధాన కార్య దర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు మద్దతుగా మండలంలో సోమ వారం పార్టీ శ్రేణులతో కలసి పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు టీడీపీ కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. నారా లోకేష్ యువగళం పాదయాత్ర దిగ్విజయంగా 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్బంగా యువగళం పాదయాత్ర కు మద్దతుగా రాష్ట్ర తెలుగుదేశం పార్టీ పిలుపు మేరకు సోమవారం మధ్యాహ్నం 3.00 గంటలకు నిడదవోలు మండలం డి. ముప్పవరం నుండి పాదయాత్ర బయలుదేరి వయా సమిశ్రగూడెం మీదుగా నిడదవోలు పట్టణం లో గల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం వరకు సుమారు 7.5 కిలో మీటర్లు పాదయాత్ర నిర్వహిస్తున్నారని ఈ పాదయాత్ర లోనిడదవోలు నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ ఇన్ ఛార్జ్ బూరుగుపల్లి శేషా రావు పాల్గొంటారన్నారు. నిడదవోలు నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయవలసిందిగా అ ప్రకటనలో కోరారు.

గ్రామ దేవతకు నరసింహం పూజలు

విశాలాంధ్ర-జగ్గంపేట: గ్రామదేవత శ్రీ రాములమ్మ తల్లి అమ్మవారిని మాజీ మంత్రి, మాజీ ఎంపీ తోట నరసింహం దర్శించుకున్నారు. అనారోగ్య రీత్యా గత నాలుగేళ్లుగా నరసింహం నియోజవర్గానికి దూరంగా ఉన్నారు. శస్త్ర చికిత్స అనంతరం ఆయన తొలిసారిగా నియోజవర్గ కేంద్రానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుని ఆలయంలో పూజలు చేశారు. నరసింహకు ఆయన అనుచరులు, అభిమానులు స్వాగతం పలికారు. ఆయన వెంట వైసీపీ నాయకులు రామకుర్తి శ్రీరామచంద్రమూర్తి, ఎస్‌పి గఫూర్, తుల రాము, రామకుర్తి జగాలు, తదితర నాయకులు ఉన్నారు.

అపూర్వ సంగమం

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి అంబటి సత్యనారాయణ రావు జిల్లా పరిషత్ హై స్కూల్ లో 2005-2006 పదో తరగతి బ్యాచి విద్యార్థులు ఒక చోట కలుసుకుని ఒకరి ఒకరి క్షేమాలు అడిగి తెలుసుకుని ఆనాటి స్మృతులను గుర్తు చేసుకుని ఆధ్యాత్మిక పలకరించుకున్నారు.